# అధికారాల అంతర్యాలు



Raju

## పాలగిరి. వేణు

"మా చంటిదాన్ని డాక్టర్ గారి దగ్గరకు తీసుకెళ్ళాలి... ఓ అరగంట పర్మిషన్ కావాలిసార్"

సెక్షన్ మానేజర్ తలెత్తి తప్పదా అన్నట్లు ఓ మారు చూసి, తప్పేట్లుగా లేదన్నట్లు నసుగుతూనే "సరే" ననేశారు....

కృష్ణమూర్తి ఫైళ్ళు సర్దేసి గబగబ మేడమెట్లు దిగి కారిడార్‌లో చేరాడు....

అప్పుడు సరిగా నాలుగున్నరయింది....

పిలవకపోయినా వచ్చిన అతిథిలా.... పెట్టక పోయినా రోజూ వచ్చే బిచ్చగాడిలా... వచ్చేశాయి చిటపట చినుకులు....

ఏంటో?... చెప్పా పెట్టాకుండా ఏదో పని గట్టుకుని ఆఫీసు వదిలే సమయానికి ఠంచనులలో వచ్చేస్తుంది యీ వర్షం ...

కృష్ణమూర్తి కారిడార్ లోంచి తల బయటకు పెట్టి ఆకాశం వైపు తొంగి చూశాడు.... మబ్బులో నిండివుంది ఆకాశం.... గాలి లేదు.... అంటే భారిగా పడేలా వుంది వర్షం... తడిసిన ముఖాన్ని తుడుచుకున్నాడు కృష్ణమూర్తి.

చంటిదానికి రాత్రల్లా జ్వరం.... డాక్టర్‌గారి దగ్గరకు వుదయమే తీసుకెళ్ళా మనుకున్నాడు కాని.... వీల్లేక పోయింది కారణమంటూ ఏం లేదు! నెలలో ఆఖరి వారం. . చేతిలో డబ్బు లేదు. . డాక్టర్ గారికి యీయవలసిన పాత బాకీలో యింకా మిగులు వుంది.... అయినా తప్పలేదు... డాక్టర్ తనుండే ప్రాంతంలో సాయంకాలానికే తన "డిస్పెన్సరి" తెరుస్తాడు.... సాదా జనంతో కిక్కిరిసి వుంటుంది... అందుకని ముందుగా వెళ్తే సుజావుగా డాక్టర్ గారితో కలవచ్చుని.... యీ "పర్మిషన్" తీసుకున్నాడు. మానేజర్ గారు ఏ 'మూడ్'లో వున్నారో అంగికరించారు... లేకపోతే వెధవ ప్రశ్న లేసి, విసిగించేసి, పర్మిషన్ కాన్సిల్ చేసుకొనేలా చేస్తాడు... అతి సులువుగా పర్మిషన్ దొరికింది అందుకనే కాబోలు యీ వెధవ వర్షం. అడ్డంకి .

వర్షం పెద్ద దయింది .

"బస్టాండు" చేరాలంటే అర కిలో మిటరు దూరం. పావు గంట సమయం పట్టుతుంది... ఇంత వర్షంలో తడిసి వెళ్ళాలంటే పోనీ వెళ్తే బస్సులు దొరకాలి.. పోనీ అక్కడేమైనా "షల్టర్" వుందా అంటే! . అబ్బే!

పోనీ వెళ్తే!....

వర్షం పెద్ద దయింది. గాలి కూడా వీస్తూ మరి వుధృతంగా వుంది వాతావరణం.

ఇంకో పది నిముషాలు గడిచాయి. ఎలాంటి మార్పు లేదు...

ఐదయి పోయింది... అందరూ "కారిడార్" లోనికి వచ్చి నిలబడ్డారు.

అనవసరంగా "పర్మిషన్" వృధా అయింది... మేనేజర్ గార్ని యింకోసారి "పర్మిషన్" కావాలని అడగాలంటే ఎంత బతిమాలలో ?

చి! ఛీ" వెధవ వర్షం...

వీళ్ళంపరూ ఆఫీసులో కూచుని, వర్షం ఆగేవరకు

ఏ ఆఫీసు పని చేసుకోవచ్చుగా....! ఉహూ.... తనకేదో అవసరముంది పర్మిషన్ తీసుకున్నాడు గాని....

"ఏం వెళ్ళ లేదూ!..." మానేజర్ గారి ప్రశ్న...

"లేదండి... అరగంట నుండి వర్షం యిలాగే వుంది..." అన్నాడు కృష్ణమూర్తి – వినయంగా....

వెధవకు తెలియదూ? ఇంత పెద్ద వర్షంలో ఎలా వెళ్తాననుకున్నాడు...?

మానేజర్ గారు యింకేం మాట్లాడ లేదు...

కారిడార్ నిండా ఉద్యోగస్తులే... ఏవో కబుర్లు.... కథాకళీలూ...

అందర్లోను వర్షంలో యిరుక్కు పోయామే ననే బాధ ప్రస్ఫుటిస్తోంది... మైన్ రోడ్డుకు యింత దూరంగా ఆఫీసు పెట్టిందానికి కొంతమంది యాజమాన్యాన్ని తిట్టి పోస్తున్నారు....

ఒక్కసారిగా గాలి విసురుగా వీచి, "కారిడార్" సగాన్ని తడిపింది జల్లు...

చంటిదాని కెలావుందో? లక్ష్మిని తీసుకెళ్ళమన్నా బావుండేది....! అయినా యింత వర్షంలో ఆ డాక్టర్ డిస్పెన్సరీ తెరవద్దూ!... ఆలోచనల వురవడిలో పడిపోయాడు కృష్ణమూర్తి...

ఇంకో పది నిముషాలు గడిచాయి... వర్షం మరిమరి పెద్దదయింది...

చాలా మంది సిగరెట్లు వెలిగించి బాతాఖానీలో పడిపోయారు... వర్షం కొంచెం తగ్గినా బయటపడేందుకు తహతహ లాడుతున్నారు.

ఇంతలో కలకలం... సిగరెట్లు వెనక్కి జారుకున్నాయి...

జనరల్ మానేజర్ రావుగారు వస్తున్నారట....

నోట్లో పైప్.... భారిగా హుందాగా మెట్లుదిగి కారిడార్ లోనికి వచ్చారు... అందరూ ప్రక్కలకు తప్పుకుని నిలబడ్డారు...

"వర్షం తగ్గేట్టుగా లేదూ!...." ఎంతో గంభీరంగా ప్రశ్నించాడు....

"లేదండి...." అంటూ వెనక నుండి ఎవరో జవాబిచ్చారు....

రెండు నిముషాలు నిలబడ్డారు రావుగారు... కారిడార్ ఎంతో నిశబ్దంగా వుంది... వాచీ చూసుకున్నారు... ఏదో "ఎంగేజ్‌మెంట్" వున్నట్లుంది... వెళ్ళేదం తప్పని సరిలావుంది... విసుగ్గా ఫీలవుతున్నారు రావుగారు... శ్రీవారి కారు గారి డ్రైవరుగారు యీ రోజు శెలవట మరి...

కారిడార్లోని జనం వైపు ఓసారి చూశాడు.... అతడి చూపు కృష్ణమూర్తి మీద పడింది...

"డు యు లైక్ టు కమ్ విత్ మి...."

అందరూ కృష్ణమూర్తి వైపు చూశారు....

కృష్ణమూర్తి కంగారు పడ్డాడు... ఖంగు తిన్నాడు... "జి. ఎం."గారు తన్ను పిలవటమా? ఆశ్చర్యపోతున్నాడు... నిజమా! కలా!!

"యస్‌సార్!" నోట్లోంచి మాట పెగలక పోయినా తల మాత్రం ఆడించేశాడు కృష్ణమూర్తి... ఇంత మంది తోటి వుద్యోగస్తులలో తనకే జి. ఎం." గారు పిలుపు నివ్వటం ఎంత అదృష్టం...!

కారు షెడ్ వరకు ఎవడో గొడుగు పట్టేశాడు జి. ఎమ్. గారికి. వాడు అంతమాత్రానికే కాలరెత్తేశాడు... "షెడ్" వరకు వర్షంలో పరుగెట్టుకు వెళ్ళాడు కృష్ణమూర్తి. కొంత తడిశాడు కూడాను...

జి. ఎం. గారు కారు ముందు డోర్ తెరిచాడు. ఎంతో వినయంగా ఎక్కి కూచున్నాడు కృష్ణమూర్తి. కారు బయల్దేరింది. కారిడార్లో నిలబడివున్న జనం వైపు ఆదో రాజసంగా తల తిప్పి చూశాడు కృష్ణమూర్తి. తన్ను చూసి అందరూ కుతకుత లాడుతున్నట్లు అన్పించింది.

కారు మెల్లగా వెళ్తోంది.

డ్రైవ్ చేస్తున్న జి. ఎం. గారికి దూరంగా జరిగి డోరు పట్టుకు బిగిసిపోయి కూచున్నాడు కృష్ణమూర్తి.

తనెంత అదృష్టవంతుడు? అంత మందిలోను జి.ఎం. గారు తనకు "లిఫ్ట్" యిస్తారని తను వూహించాడా? రేపు అందర్లోను తనకో ప్రత్యేకత... సెక్షన్ మానేజర్ తనకు ఎప్పుడడిగినా పర్మిషన్లు ఏలాంటి గొణుగుడు లేకుండా శాంక్షన్ చేయడూ? జి. ఎం. గారి కారులో జి. ఎం. గారి ప్రక్కనే కూచుని వూరేగుతూంటే!!... ఎంత వైభవం... ఎంత వైభోగం... మరెంతో ఆనందంగా వుంది కృష్ణమూర్తికి.

"ఏ సెక్షన్లో పని చేస్తున్నావ్?" అన్నాడు రావుగారు.

అదో వురుములా వినపడి వులిక్కిపడ్డాడు కృష్ణమూర్తి.

"సేల్స్ సెక్షన్ సార్!" ఎంతో మృదువుగా చెప్పాడు.

"ఐ సీ! నీ పేరు?"

చెప్పాడు కృష్ణమూర్తి.

కారు కిటికీలు పూర్తిగా మూసేయటం వల్ల, కారంతా రావుగారి వదిలిన "పైప్" పొగతో నిండివుంది.

కృష్ణమూర్తి ఆ వాసనతో వుక్కిరి బిక్కిరి అవుతున్నాడు. అయినా వుగ్గ బట్టుకు కూచున్నాడు.

రోడ్డు నిండా నీళ్ళే! కార్లు... అప్పుడప్పుడో బస్సు తప్ప రోడ్డు మీద ఏ వాహనం కూడ నడవటం లేదు.

కారు జాగ్రత్తగా డ్రైవ్ చేస్తున్నారు రావుగారు.

ఇంకో పావు గంట గడిచింది.... రావుగారు మౌనంగా వుంటున్నారు. పొగ ఎక్కువయి కృష్ణమూర్తి దగ్గటం మొదలెట్టాడు.

"ఐ యామ్ సారీ! మిస్టర్ మూర్తి!" అంటూ "సైడ్ విండోస్" తెరిచారు రావుగారు.

చల్లగాలి రివ్వున లోనికి దూసుకు వచ్చింది. పొగ మెల్ల మెల్లగా బయటకు జారింది... "ఈజీనెస్"గా వుంది కృష్ణమూర్తి...

వర్షం తగ్గనే లేదు..."వైపర్లు" టప టపమని కొట్టుకుంటున్నాయి.

పై "చౌరస్తా"లో దిగితే తన యిల్లు ఓ రెండు ఫర్లాంగుల దూరంలో వుంటుంది. దిగితే బావుణ్ను. కారు ఆపమని అడిగితే– బావుంటుందా? అమ్మో!! జి. ఎం. గారు ఏమైన అనుకోరూ! ఛ! ఛ!!బావుండదు. మరి ఎంత సేపు? ఎంత దూరం?? ఈ ప్రయాణం.... పోనీ జి. ఎం. గారు తనను ఎక్కడ దిగాలి? ఆపనా!! అంటూ అడిగితే ఎంత బావుండేది... మరి.... ఎలా??

కారు ఆ "చౌరస్తా" కూడా దాటేసింది.

జి. ఎం. గారి దృష్టి తనపై ఎందుకు పడిందో? ఇంత మంది తోటి వుద్యోగుల్లో తన్ను మాత్రమే ఆహ్వానించడమే ఎంత గొప్ప... అబ్బ! కారు సీట్లు ఎంత మెత్తగా వున్నాయి...

జి. ఎం. గారే ఏదైనా మాట్లాడితే బావుణ్ను అనుకున్నాడు కృష్ణమూర్తి... ఏదో రకంగా అంటుకు పోయేవాడు.

"చూడు మిస్టర్ మూర్తి! మీ దగ్గరుండి... అంటే



మి సెక్షన్నుండి– "మంత్లీ సేల్స్ ప్రొసీడ్స్ స్టేట్‌మెంటు" రావాలి. ఇంతవరకు నాకు రాలేదు. రేపోసారి మీ మానేజర్‌గారికి గుర్తు చేయండి" అన్నాడు రావుగారు.

"అలాగే సార్!" అంటూ తలూపాడు కృష్ణమూర్తి.

కృష్ణమూర్తి బిగుసుకు పోయాడు... ఆ "స్టేట్‌మెంట్" చేస్తున్నది తనే! ఎవరు చేస్తున్నారని అడగడుగా? అడిగితే తన పని ఔట్! ఇంతవరకు యీ నెలలో ఆ స్టేట్‌మెంట్ యింతవరకు ముట్టుకో లేదు. మానేజర్ గారు రోజూ అడుగుతున్నా, తనే ఏదో సాకు చూపించి దాటేస్తున్నాడు. జి. ఎం. గారు యింకేం అడక్కుండా, కార్ని ఆపేసి తన్ను దిగి పొమ్మంటే... తనెంత అదృష్టవంతుడు? అనవసరంగా కారెక్కేశాడు తను... పెద్ద పొరపాటే చేశాడు. ఏ పంజాబ్ సమస్యో, ప్రధాన మంత్రి విదేశీయాత్రా గురించి అడిగితే బావుణ్ను... ఆఫీసు పని గురించి అడిగితే ఎలా?... కృష్ణమూర్తికి దిగులు పట్టుకుంది...

"సారీ! మిస్టర్ మూర్తి! మీరెంత వరకు వెళ్ళాలి?"

"మాసాబ్ టాంక్ సార్!" తక్కున చెప్పేశాడు కృష్ణమూర్తి తడబడకుండా...

"వెరిగుడ్... నేను శాంతినగర్ వెళ్తున్నా... ఐ విల్ డ్రాప్ యు యిన్ మై ప్లేస్... మీకు అక్కణ్నుంచి దగ్గరను కుంటాను..."

"అవున్సార్!"

"హేవ్ సమ్ కాఫీ. అండ్ కన్ గో!"

"థాంక్యూ సార్!"

జి. ఎం. గారు తన్ను కాఫీకి ఆహ్వానించడమే! అంటే జి. ఎం. గారి బంగళాకు తను వెళ్తున్నా డన్నమాట!! ఎంత అదృష్టం... ఎంత గౌరవం... తన ప్రిస్టేజి పెరిగి పోయింది... మరింత పొంగి పోయాడు

# అధికారాలు ... అంతర్యాలు

కృష్ణమూర్తి...

కారు మలుపు తిరిగింది...

ఆధునాతనమైన ఓ పెద్ద బంగళా ముందు కారాగింది... కారును షెడ్‌లోనికి తీసుకెళ్ళారు రావుగారు...

ఎవరో నౌకరు వచ్చి గొడుగు తీసుకువచ్చి రావుగారిని లోనికి తీసుకెళ్ళి పోయాడు.

వరండాలో సోఫా లున్నాయి. ఓ సోఫాలో ముడుచుకు కూచుని. తడిసిన తలను. కర్చీఫ్‌తో తుడుచు కుంటున్నాడు కృష్ణమూర్తి.....

జి. ఎం. గారింట్లో కాఫీ...! తనలాంటి సామాన్య వుద్యోగికి ఎవరికి పట్టలేనంత ఎంతో సంబరపడు తున్నాడు కృష్ణమూర్తి.

బయట వర్షం తగ్గి... జల్లు పడుతోంది పూల వానలా !!....

రేపు ఆఫీసులో చెప్పుకోవాలి తనకు జరిగిన మర్యాద... అందరూ ఆశ్చర్య పోవాలి... ముఖ్యంగా మానేజర్!... మరింత గొప్పలు చెప్పుకోవాలి.... అందరిదృష్టిలో రేపు తనో ముఖ్యుడు అలానే పది నిముషాలు గడిచాయి....

లోనుండి కాఫీ రాందే! జి.ఎం.గారు తన్ను మర్చిపోలేదు కదా! శ్రీవారికి ఎన్ని "అవగేషన్లు" మరి....

ఇంకో ఐదు నిముషాలు.... ఊహూ ! ..

లేచి వెళ్ళిపోతే అతిథి మర్యాదల్ని తిరస్కరించినట్లు కాదూ.. ?

శ్రీవారికి కోపం వస్తే....? తను తట్టుకోగలడా ?!

తలుపు కిర్రుమంది.... ఇందాక గొడుగు పట్టిన నౌకరు ఒక కప్పులో కాఫీ తెచ్చిపెట్టి మళ్ళీ లోనికి వెళ్ళిపోయాడు మౌనంగా...

కాఫీ బాగా చల్లారిపోయింది.... రెండుగుక్కల్లో ఖాళీ చేశాడు

ఇకసెలవు తీసుకోవాలి?... ఎలా ?

అదే నౌకరు మళ్ళీ ఖాళీ కప్పుకువస్తే తను వెళ్తున్నట్లు జి.ఎం.గారికి నివేదించమనాలి !

ఇంకో పది నిముషాలు... ఎవరూ రాందే ?.... మరలా ?....

ఎందుకనో ఒక్కసారిగా కృష్ణమూర్తికి చంటిది జ్ఞాపకం వచ్చింది.... జ్వరం తగ్గిందో ? లేదో? డాక్టర్ తన ఢిస్పెన్సరీ తెరిచాడో లేదో ?ముందుసారిగా జ్వరం వచ్చినప్పుడు డాక్టర్‌గారిచ్చిన బిళ్ళలు యింకా మిగులుండాలి. అవి వేస్తే సరిపోతుందా ?

ముళ్ళ మీద కూచున్న కృష్ణమూర్తి దిగ్గున లేచాడు....

తలుపు దగ్గరకెళ్ళి 'బెల్' మూగిస్తే !... తప్పుకదూ ! అనవసరంగా 'డిస్టర్బ్ చేసినట్లు వుండదూ!... ఇక్కణ్నుంచి మెల్లగా జారుకోవటం మంచిది.... మరి జి.ఎం.గారి శెలవు తీసుకోకుండానే ?....

అదిగాక.... తను వెళ్ళాల్సిన చోటు 'మసాబ్ టాంక్' అన్నాడే గాని, తను మళ్ళీ వెనక్కు యిందాక వచ్చిన దారమ్మటే పంజాగుట్ట వైపు వెళ్ళాలి తనింటికి వెళ్ళాలంటే!. . బస్సు దొరికితే బావుణ్ను.... లేకపోతే వర్షంలో తడుస్తూ నడుస్తూ వెళ్ళాల్సిందే . . తను వర్షంలో తడిస్తే జలుబు... ఆపైన జ్వరం రాదు కదా?...

పూల జల్లు ...మళ్ళీ పెద్ద వర్షమై కూచుంది..... మరో పది నిముషాలు గడిచాయి... ఇక వుండలేకపోయాడు..

గేటు తీసుకుని రోడ్డున పడ్డాడు అంత వర్షంలోను కృష్ణమూర్తి... అయినా ఎంత వడివడిగా నడుస్తున్నా అతడిలో ఓ గర్వం... తృప్తి వుంది... రేపు ఆఫీసులో తనో వెరి ఇంపార్టెంట్ పర్సన్... అతడు ఓ అల్పసంతోషి కాదూ....?

బంగళాలో ....

"ఇంత పెద్ద వర్షంలో ఎలా వచ్చారండీ! కారు బ్యాటరి కూడా 'వీక్' గా వుందన్నారు....?" అంది నీరసంగా జి. ఎమ్. గారి సతీమణి... ఆమె గారికి మధ్యాహ్నం నుండి తలనొప్పి ... కొంత టింపరేచరూనూ...

"కారు బ్యాటరి 'వీక్' అయితే ఏమయిందని?.... మధ్యలో కారు ఆగిపోతే తోసేందుకు ఒకణ్ణి తోడు తెచ్చుకున్నానుగా...! ఏంటో మరి? కారు ఆగలేదు... లేకపోతే యింత వర్షంలో అతడు కారు తోయాల్సి వచ్చేది... అది సరేగాని ఓసారి డాక్టర్ గార్ని రమ్మని ఫోన్ చేయమంటావేంటి?...." అంటూ పైప్‌ను మరోసారి వెలిగించుకున్నాడు రావుగారు..... □

